పాలనకు సుస్తీ



చీరాల తహసీల్దార్ కార్యాలయం



రెగ్యులర్ ఎస్టీఓ లేని చీరాల ఉపఖజానా కార్యాలయం

- చీరాల మండలంలో ఇన్‌చార్జులకే పగ్గాలు
- ముఖ్య శాఖల్లోనూ అంతే..
- పూర్తిస్థాయి అధికారులు లేక పనుల్లో జాప్యం

చీరాల టౌన్: మండలంలో పాలన అటకెక్కుతోంది. పలు శాఖలకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో అత్యవసర సేవలకు కూడా అంతరాయం కలుగుతోంది. రెవెన్యూ, పంచాయతీ రాజ్, సబ్ ట్రెజరీ, డీఎల్‌పీవో, ఉపాధి హామీ, సీడీపీఓ ఇలా అన్ని శాఖల్లో ఇన్‌చార్జు అధికారులే కొలువుదీరారు. ఫలితంగా చీరాల మండలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ మండలాలతో పాటు అదనపు బాధ్యతలను కూడా నిర్వహించడంతో పాలన నల్లేరుపై నడకలా సాగుతోంది. తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు ఆర్ఐలు పనిచేయాల్సి ఉండగా మూడు నెలల క్రితం ఆర్ఐ కుమార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేయడంతో అప్పటి నుంచి చీరాల టౌన్‌కు వీఆర్వో సత్యం, రూరల్ మండలానికి వాడరేవు వీఆర్వో శేఖర్‌ను ఇన్‌చార్జులుగా నియమించారు. అలానే పట్టణం, రూరల్ గ్రామాల్లో ఏడు ప్రదేశాలకు రెగ్యులర్ వీఆర్వోలు లేకపోవడంతో మరో కొంతమందికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. చీరాల ఎస్టీవోగా పనిచేస్తూ కమిషన్ల కోసం బిల్లులు పాస్ చేయకపోవడంతో ఉన్నతాధికారులు ఎస్టీవో భాగ్యలక్ష్మిని ఆరు నెలల క్రితం ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో బాపట్ల ఎస్టీఓ సుబ్బారావును చీరాల ఇన్‌చార్జి ఎస్టీవోగా నియమించారు. ఈ క్రమంలో ఎనిమిది మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, ఇతర బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని పలువురు వాపోతున్నారు. అలానే వేటపాలెం ఐసీడీసీ రూరల్ ప్రాజెక్టు సీడీపీవోగా ఇంకొల్లు సీడీపీవో ఝూన్సీని ఇన్‌చార్జి రూరల్ సీడీపీవోగా నియమించారు. అలానే చీరాల ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో దాసును వేటపాలెం బదిలీ చేయగా చీరాల మండలానికి ఇన్‌చార్జి ఏపీవోగా దాసు విధులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదు. గవినివారిపాలెం పశువైద్యులుగా పనిచేస్తున్న వైద్యుడు బదిలీ అయి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ రెగ్యులర్ పశు వైద్యులను నియమించలేదు. దీంతో ఈపురుపాలెం పశువైద్యురాలు పావని ఇన్‌చార్జి పశు వైద్యురాలుగా రెండు మేజర్ గ్రామాలు, మండలంలోని చాలా గ్రామాలకు పశు వైద్యురాలిగా సేవలు అందించాల్సి వస్తోంది. చీరాల డీఎల్‌పీవోగా బాపట్ల జిల్లా వేమూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న శివన్నారాయణను ఇన్‌చార్జిగా నియమించారు. అలానే పలు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు సైతం ఇన్‌చార్జి భాధ్యతలను నిర్వహిస్తున్నారు. పలు శాఖల్లో సిబ్బంది కొరత కారణంగా ఇన్‌చార్జి విధులను నిర్వహిస్తుండటంతో పనుల్లో జాప్యం కలగడంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

అన్నంబొట్లవారిపాలెం మాజీ సర్పంచ్ మృతి

పర్చూరు (చినగంజాం): అన్నంబొట్లవారిపాలెం మాజీ సర్పంచ్ చెన్నుపాటి సింగయ్య (87) మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షునిగా పని చేశారు. పర్చూరు మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోర్టులకు వెళ్ళి సఫలీకృతులయ్యారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు.

చెరువులను సాగర్ నీటితో నింపండి



పెదఅంబడిపూడి రక్షిత పథకాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ, డీఈ

బల్లికురవ: వేసవి దృష్ట్యా నోటిఫైడ్ చెరువులన్నింటినీ సాగర్ నీటితో పూర్తిస్థాయిలో నింపాలని ఎస్ఈ అనంతరాజ్ కోరారు. బుధవారం పెద అంబడిపూడిలో ఆరు గ్రామాలకు సురక్షిత మంచినీరు అందించే వీపీడబ్ల్యూ టీంను పరిశీలించారు. ఇటీవల జరిగిన చెరువు కట్ట అభివృద్ధి, జంగిల్ క్లియరెన్స్, స్టోరేజ్ చెరువును ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నీటి బొట్టు అమృతంతో సమానమన్నారు. డీఈ శ్రీనివాసులు, ఏఈ గిరినాయక్ పాల్గొన్నారు.

వైద్యుల సూచనలతో ఆరోగ్యం

చీరాల టౌన్: గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని.. సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరుగుతాయని ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం మాట్లాడుతూ 20 రోజులకు ఒకసారి సేవలు పొందాలన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉండాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

8 నుంచి గ్రామాల్లో పి- 4 సర్వే



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి అనంతరాజు

జె.పంగులూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పి-4 (పబ్లిక్, ప్రయివేట్, పీపుల్, పార్ట్నర్షిప్) కార్యక్రమంలో భాగంగా ఈనెల 8 నుంచి 18 వరకు సర్వే నిర్వహిస్తున్నాట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పంగులూరు మండల ప్రత్యేక అధికారి అనంతరాజు తెలిపారు. పి- 4 కార్యక్రమంపై బుధవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సిబ్బంది సర్వే చేయాలని తెలిపారు. ధనవంతులు, పేదలు అనే దానిపై స్పష్టమైన అవగాహనకు రావాలన్నారు. నిజమైన పేదలను గుర్తించి, వారికి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా చేయడమే పి- 4 సర్వే ముఖ్య ఉద్దేశని తెలిపారు. పట్టణంలో ఇంటి స్థలం, 10 ఎకరాల పొలం, కారు, ఫ్యాను, టీవీ, ఫ్రిజ్, వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు ఇంట్లో ఉన్న బ్యాంక్ అకౌంటు ఉన్న వారిని ధనవంతులుగా గుర్తించాలని సిబ్బందికి తెలియజేశారు. ఇవి లేని వారిని గుర్తించి ప్రభుత్వానికి తెలియజేయాలని తెలిపారు. ఎలాంటి ఒడిదుకులకు లోను కాకుండా కచ్చితమైన సర్వే చేయాలని కోరారు. ఎంపీడీఓ కె. స్వరూపరాణి, తహసీల్దార్ పి. సింగారావు, పంగులూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ బాలరాజేశ్వరి, ఈవోఆర్డీ కె. సుమంత్, పంచాయతీ రాజ్ ఏఈ హనుమంతు రావు, హౌసింగ్ ఏఈ కిషోర్, ఏఈ శివయ్య, ముప్పవరం క్లస్టర్ సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

8 నుంచి సమస్యలపై సీపీఎం సర్వే



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య

జె.పంగులూరు: నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై సర్వే నిర్వహించి, ఆ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించేందుకు ఈ నెల 8 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలో గ్రామ గ్రామాన సీపీఎం ఆధ్వర్యంలో సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. బుధవారం పంగులూరులో నిర్వహిస్తున్న సీపీఐ మండల కమిటీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. నిత్యం ప్రజలు ఆ సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఆ సమస్యల పరిష్కారం తోపాటు, ఎన్నికల హామీగా అధికార పార్టీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ప్రచారం కార్యక్రమం పోరాటం జరుగుతోందన్నారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్య, బెల్ట్ షాపుల సమస్య, ఇళ్ల స్థలాల సమస్య, డ్రైనేజ్ సమస్య, దోమల సమస్య, ఉపాధి హామీ, వీధిలైట్ల, మైక్రో ఫైనాన్స్, గిట్టుబాటు ధరల సమస్య, నల్లబర్లీ పొగాకు కొనుగోలు వంటి అనేక సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారం రావడంతోనే మొదటి సంతకంగా డీఎస్సీ నిర్వహిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేశారని, అయితే అధికారం వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇంతవరకు మొదటి హామీ అమలు కాకపోవడం పట్ల నిరుద్యోగుల్లో అసహనం కలుగుతోందని గంటయ్య తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ. 3 వేల, మహిళలకు నెలకు రూ. 1500 వందలు వంటి పథకాలు ఇంతవరకు అమలు చేయలేదన్నారు. మండల కమిటీ కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ జిల్లా నాయకులు రాయిణి వినోద్‌బాబు, మండల కమిటీ సభ్యులు మానం హరిబాబు, పూసపాటి సుబ్బరాజు, పి. ఏలియా పాల్గొన్నారు.

పిల్లల పెరుగుదలపై పర్యవేక్షణ



కుంకలమర్రు పోటీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు



కారంచేడు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుజాత



చినగంజాం: పౌష్టికాహారం అందజేస్తున్న సీడీపీఓ ఝూన్సీ

చినగంజాం: పిల్లల పెరుగుదలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ టి. ఝూన్సీ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా కడవకుదురు 4 అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం సీడీపీఓ టి. ఝూన్సీ ఆధ్వర్యంలో పోషకాహార లోపంతో ఉన్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహారం లోపంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లల ఎదుగుదల వారి పర్యవేక్షణ, ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిదండ్రుల ముందు పిల్లల ఎత్తు, బరువు కొలిచి పోషణ స్థితిని తల్లిదండ్రులకు తెలియపరిచారు. అదే విధంగా ఇంటి దగ్గర తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వారికి అవగాహన కలిగించారు. పిల్లల తల్లులకు పౌష్టికాహారం అందించారు. సూపర్ వైజర్ ఉష, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

కారంచేడు: మహిళలు, బాలికలను గౌరవించేలా ప్రవర్తించాలని ఎస్ఐ వి. వెంకట్రావు అన్నారు. బుధవారం జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని కుంకలమర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీలను నిర్వహించారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేలా ప్రభుత్వాలు ఎన్ని చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటున్నా.. అల్లరిమూకలు ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నాయన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రభుత్వ నిషేధం ఉందన్నారు. గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులను పంపిణీ చేశారు.

యద్దనపూడి: మహిళా అభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని యనమదలలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

వేసవి దుక్కులకు సిద్ధం కావాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన అధికారులు, రైతులు

ఇంకొల్లు(చినగంజాం): రైతులు వేసవి దుక్కులు దున్నుకునేందుకు సంసిద్ధులు కావాలని మండల వ్యవసాయాధికారి పి. వేణుగోపాల్ అన్నారు. మండలంలోని నాగండ్ల, సూదివారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి పి. వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ- పంట నమోదు చేయించుకునే రైతులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. రబీ పంటల తరువాత వేసవి దుక్కులు దున్నుకోవాలని, దాని వలన భూమిలో ఉన్న పురుగులు లేదా వాటి గుడ్లు నాశనం అవుతాయని వివరించారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నల్లబర్లీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

జె.పంగులూరు: నల్లబర్లీ పొగాకు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయించి, తక్షణమే కొనుగోలు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పంగులూరు తహసీల్దార్ పి. సింగారావుకు వినతిపత్రం అందజేశారు. నల్లబర్లీ పొగాకును కంపెనీలు ఇంతవరకు కొనుగోలు చేయలేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు అన్నారు. మిర్చి క్వింటా రూ. 20 వేలు చొప్పున కొనుగోలు చేయాలన్నారు. విద్యుత్ సవరణ చట్టం విరమించుకోవాలని డిమండ్ చేశారు. మానం హరిబాబు, తానికొండ సుధాకర్ రావు, నందవరపు జాన్‌సాహెబ్, వెంటకేశ్వర్లు, శ్రీకాంత్ తదితరులున్నారు.

క్లుప్తంగా..

ప్యూరిఫయర్ అందజేత

చీరాల రూరల్: ఇంటర్నేషనల్ వాకర్స్ ఎస్‌ఆర్‌అండ్‌పీఎం, చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రకేసరి ప్రకాశం అండ్ ప్రగడ కోటయ్య జూనియర్ కళాశాలకు రూ. 15,000 విలువ కలిగిన వాటర్ ప్యూరిఫయర్ అందజేశారు. ఉపాధ్యక్షుడు.. దాత గుద్దంటి రమేష్‌బాబు సహకారం అందించారు. జరిగిన సభలో అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, దాత రమేష్‌బాబు మాట్లాడారు. వేసవి దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు ఉపయోగ పడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. చారుగుళ్ల గురుప్రసాద్, గోలి మల్లికార్జునుడు, ప్రగడ వెంకట శేషయ్య, పులిమి శ్రీకృష్ణప్రసాద్, గుర్రం బదరీ, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మద్యం షాపు డ్రా

పర్చూరు(చినగంజాం): ఇంకొల్లు మండలంలోని గౌడ కులస్తులకు కేటాయించిన మద్యం షాపునకు సంబంధించి గురువారం ఉదయం 8 గంటలకు బాపట్ల కలక్టరేట్ ఆవరణలో పీజీఆర్ఎస్ హాలులో డ్రా జరగనుంది. ఈమేరకు పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భుజంగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం షాపు కోసం దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని కోరారు.

నాటుసారా నిర్మూలన అందరి బాధ్యత

చీరాల: నాటుసారా నిర్మూలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా రామ్‌నగర్‌లో గ్రామ సభ నిర్వహించారు. బాపట్ల, ఒంగోలు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు జనార్దన్, వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ జట్టు ప్రతిభ

వేటపాలెం: జాతీయ వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు ప్రతిభ కనపర్చి విన్నర్స్‌గా నిలిచిందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు బుధవారం తెలిపారు. అరావతి ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో జాతీయ స్థాయి యూత్ పెస్టివల్ మిలన్ 2025 సందర్భంగా వాలీబాల్ పోటీలు జరిగాయని తెలిపారు. సెయింట్ ఆన్స్ కాలేజీ జట్టు స్వర్ణ ఆంధ్రా ఇంజినీరింగ్ కాలేజీ జట్టుతో జరిగిన ఫైనల్స్‌లో తలపడి విన్నర్‌గా నిలిచి రూ.30 వేలు నగదు బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ కె. జగదీష్‌బాబు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ఆర్‌వి రమణ మూర్తి, అక్రిడి టేషన్స్ డైరెక్టర్ సి. సుబ్బారావు, అభినందించారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

బల్లికురవ: వేసవి ఎండల దృష్ట్యా విద్యార్థులకు రెండు నెలలపాటు ప్రతిరోజూ దాతలు మజ్జిగ అందించటం అభినందనీయమని ఎంఈవో - 2 రమేష్‌బాబు అన్నారు. బుధవారం కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో దాతలు కాకర్ల యజ్ఞనారాయణ, పోకూరి శ్రీను మజ్జిగ అందజేయగా పంపిణీ ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం పి. రామాంజనేయులు ఉపాధ్యాయులు, పీఆర్‌పీ అశోక్ పాల్గొన్నారు.

922 మంది డ్రాపౌట్లు

బల్లికురవ: డ్రాపౌట్స్ విద్యార్థుల వివరాలను తక్షణమే గ్రామాల వారీగా సేకరించాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ శ్రీనివాసరెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీలో సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. 922 మంది డ్రాపౌట్లు ఉన్నట్లు గుర్తించారని వీరందరి వివరాలు సేకరించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సాగర్, ఎంఈవో2 కె. రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కన్వీనర్ల మార్పు



జంపని వీరయ్య



రావూరి వేణుబాబు



చిన్ని పూర్ణారావు



శివరాంప్రసాద్



కటారి చిన్న అప్పారావు



మున్నం వెంకట నాగేశ్వరరెడ్డి

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లను మారుస్తూ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలు వెలువడ్డాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్చూరు, చినగంజాం మినహాయించి మిగిలిన నాలుగు మండలాల కన్వీనర్‌లుగా కొత్తవారికి అవకాశం కల్పించారు. మార్టూరు మండల కన్వీనర్‌గా జంపని వీరయ్య, యద్దనపూడి కన్వీనర్‌గా రావూరి వేణుబాబు, ఇంకొల్లు కన్వీనర్‌గా చిన్ని పూర్ణారావు, కారంచేడు కన్వీనర్‌గా జువ్వా శివరాంప్రసాద్‌లను నియమించారు. కాగా పర్చూరు కన్వీనర్‌గా కటారి చిన్నఅప్పారావు, చినగంజాం కన్వీనర్‌గా మున్నం వెంకట నాగేశ్వరరెడ్డిలను యాథావిధిగా కొనసాగించారు.

గ్రానైట్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

మార్టూరు: గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మార్టూరు సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మార్టూరులోని తూర్పు బజారుకు చెందిన బత్తుల రమేష్ బాబు(43) రాత్రి 9 గంటల ప్రాంతంలో జొన్న తాళి వైపు నుంచి మార్టూరుకు సర్వీస్ రోడ్డులో తన పల్సర్ బైక్ పై వస్తున్నాడు. అదే మార్గంలో మార్టూరు వైపు నుండి జొన్నతాళి గ్రానైట్ ఫ్యాక్టరీకి ముడి రాయిని తరలిస్తున్న భారీ వాహనం రమేష్ బాబుకు ఎదురుగా వస్తూ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాద తీవ్రతకు బైకుతో సహా వాహనం కిందకు దూసుకు వెళ్లిన రమేష్ బాబు దాని ముందు టైర్ల కింద పడి నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ మద్దినేని శేషగిరిరావు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని రమేష్ బాబు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు అందించాలి



కేంద్ర బృందంతో కేంద్రం వైద్య సిబ్బంది

ఇంకొల్లు(చినగంజాం): గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సక్రమంగా సేవలందిస్తూ సిబ్బంది ముందుకు సాగాలని న్యూఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం సూచించింది. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం, రాష్ట్రీయ కిషోర్ స్వస్థ కార్యక్రమాల అమలు తీరుతెన్నులను పరిశీలించేందుకు బుధవారం న్యూఢిల్లీ నుంచి సెంట్రల్ టీం వచ్చింది. ఈ టీం పాన్ ఇండియా స్టడీ తరపున డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు వారితో పాటు జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ సాధిక్, ఎన్‌హెచ్ డీపీఎంఓ డాక్టర్ భూషణ్, జిల్లా ఎస్‌టీఎల్ఎస్‌లు నరేంద్ర, మేరీ వచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమం అమలు తీరుతెన్నులు గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి టి. అంజలి, సీహెచ్‌ఓ కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఎన్. సహస్ర, సూపర్‌వైజర్‌లు మౌలి, ప్రభావతి, ఆరోగ్య సిబ్బంది,ఆశలు పాల్గొన్నారు.